స్పా ముసుగులో వ్యభిచారం

వేర్వేరు ప్రాంతాల్లో 13 మంది అరెస్టు

కొండాపూర్/బాలానగర్, ఆగస్టు 18 : వేర్వేరు ప్రాంతాల్లో స్పా, మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న సెంటర్లపై పోలీసులు దాడిచేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలు చందానగర్, కేపీహెచ్‌బీకాలనీ పోలీసు స్టేషన్‌ల పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఎస్‌వీఎల్ టవర్స్‌లో సాఫ్ట్ టచ్ వెల్ స్పా సెంటర్ కొనసాగుతున్నది. ఇందులో కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులు ఆ సెంటర్‌పై దాడి చేసి.. వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళ, నలుగురు యువతులు, ముగ్గురు విటులు షేక్ ఇర్ఫాన్, ఎంఎన్ఎస్ వీకే చైతన్య, నవీన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు ఎన్.హనుమంతరావు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్4లో..

కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్4లో ఎంఐజీ 286లో శ్రీలక్ష్మి నిలయం డాక్టర్ జీవీ కృష్ణారావు నివాసంలో స్పార్కిల్ పేరిట మసాజ్ ముసుగులో ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీకాలనీ పోలీసులు శనివారం రాత్రి కృష్ణారావు ఇంటిపై దాడిచేసి నలుగురు మహిళలు, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని మసాజ్ సెంటర్‌ను మూసి వేశారు.

అర్ధరాత్రి పబ్బులపై ఆకస్మిక దాడులు

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 25 పబ్బుల్లో తనిఖీలు
- ఎక్సైజ్, టీజీన్యాబ్ సంయుక్తంగా సోదాలు
- ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 25 పబ్బుల్లో ఎక్సైజ్ సిబ్బంది 25 బృందాలుగా విడిపోయి శనివారం అర్ధరాత్రి సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో కొన్ని చోట్ల తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో సిబ్బంది కూడా పాల్గొని.. ఎక్కడికక్కడే డ్రగ్స్ కోసం తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ రహిత తెలంగాణలో భాగంగా ఈ ఆకస్మిక సోదాలు చేయించినట్లు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్ వినియోగదారులను గుర్తించేందుకు 12 ప్యానెల్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్‌లో 12 పబ్స్, రంగారెడ్డిలో 13 బార్లు, పబ్స్‌పై 25 బృందాలతో శనివారం రాత్రి 10 నుంచి రాత్రి ఒంటిగంట వరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రతి బార్‌లో డ్రగ్స్ డిటెక్షన్ కిట్లతో పరీక్షలు నిర్వహించామన్నారు. హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లోని రీజం బార్‌లో టీజీ న్యాబ్ సభ్యులతో కలిసి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది 17మందిపై డ్రగ్స్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగంపై ప్రతి వారంలో ఎప్పుడైనా, బార్, పబ్బు ఏదైనా ఇక నుంచి ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తామని కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్ పర్యవేక్షణలో డీఎస్పీలు తులా శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, రంగారెడ్డి హైదరాబాద్ ఏఈఎస్ జీవన్ కిరణ్, అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ మొత్తం దాడుల్లో 17 మంది అనుమానితుల వివరాలు సేకరించినట్లు కమలాసన్‌రెడ్డి వివరించారు.

పైసలిస్తే ఆచూకీ చెప్తాం..!

ఒక్కో కేసు దర్యాప్తునకు ఒక్కో రేటు..!

- డబ్బులిస్తేనే ట్రేసింగ్.. లేదంటే పక్కకు..
- అదృశ్యం కేసుల విషయంలో గ్రేటర్ పోలీసుల నిర్లక్ష్యం

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): మిస్సింగ్ కేసు నమోదయ్యిందా.. అయితే ఒక్కో కేసుకు ఒక్కో రేటు.. ముందుగా దర్యాప్తు చేయడానికి ఒక రేటు.. మొదలుపెట్టినందుకు మరొక రేటు.. అయిపోయిన తర్వాత ఇంకో రేటు.. ఇది గ్రేటర్ పోలీసుల పని తీరు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలంటూ ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నా.. కొందరు పోలీసులు మాత్రం నిర్లక్ష్యం, అవినీతి అలవాటును మానుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మిస్సింగ్ కేసుల నమోదుతోపాటు ఆ కేసును ఛేదించేందుకు డబ్బులు కావాలంటూ డిమాండ్ చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తుండటం ఆందోళనలు కల్గిస్తున్నాయి. డబ్బులు ఇవ్వలేదంటే ఆయా కేసులను పక్కకు పడేస్తున్నారనే విమర్శలున్నాయి. మిస్సింగ్ కేసుల్లో తక్షణమే స్పందించకుంటే పరిస్థితులు కొన్ని సార్లు చేయిదాటి ప్రాణాలపైకే వచ్చే అవకాశాలుంటాయి. అలాంటి ఘటనలు జరిగినా పోలీసులు మాత్రం తమ వైఖరిని మార్చుకోవడం లేదు. మిస్సింగ్ కేసుల విషయం మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగి..ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు మాత్రమే స్థానిక పోలీసుల నుంచి చలనం ఉంటుంది. వృద్ధుల విషయాన్ని మాత్రం పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. వయస్సు మీద పడ్డవాళ్లు, మానసిక పరిస్థితులు బాగలేని వాళ్లు, వృత్తి, కుటుంబ పరమైన ఒత్తిళ్లతో మానసికంగా కృంగిపోతూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లేవాళ్లు .. ఇలా రకరకాల కారణాలతో వృద్ధులతో పాటు యువత, పెద్దవాళ్లు అదృశ్యం అవుతుంటారు. ఇందులో కొందరు ఉదయం వెళ్లి సాయంత్రం, మరునాడు వస్తుంటారు.. మరికొందరు ఎదో అఘాయిత్యం చేసుకోవడం, దూరం వెళ్లిపోవడం చేస్తుంటారు. అయితే ఇంట్లో నుంచి వెళ్లినప్పుడే పోలీసులకు ఫిర్యాదులు వెళ్తుంటాయి. అయితే.. పోలీసులు ఫిర్యాదులు స్వీకరించి.. సరిగ్గా స్పందించకుండా ఎక్కడికి పోతారు, వస్తారు లే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుంటారు. మరికొందరు ఫిర్యాదులను పక్కన పడేస్తుంటారు. ఇంకొందరు పైసలిస్తేనే మిస్సింగ్ కేసు ట్రేస్ చేస్తాం అంటున్నారు. ఇది ఇప్పుడు గ్రేటర్ పోలీస్‌స్టేషన్లలో జరుగుతున్న తంతు.

టెక్నాలజీ ఉన్నా..!

అదృశ్యమైనవారి కేసులన్నింటినీ ఒకే రకంగా చూడాల్సిన అవసరముంటుంది. టెక్నాజీ ఉన్నా కొందరు పోలీసులు వాటిని ఉపయోగించడం లేదు. కనీసం ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉండే సీసీ కెమెరాలను సైతం ప్రాథమికంగా పరిశీలించలేని పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు కేసు నమోదు చేయడానికి కూడా వెనకడుగు వేస్తుంటారు. మరి కొందరు కేసు నమోదు చేస్తే మన బాధ్యత అయిపోతుందనే ధోరణితో వ్యవహరిస్తుంటారు. కేసుల దర్యాప్తులో వేగం పెరగాలని టెక్నాలజీని పోలీసులకు సమకూర్చారు. మిస్సింగ్ అయినవారి ఆచూకీ కోసం సీసీ కెమెరాల విశ్లేషణ, సెల్‌ఫోన్ డేటా విశ్లేషణ చేసినా చాలావరకు కేసుల్లో చిక్కుముళ్లు వీడుతాయి. కానీ ఈ విషయాన్ని కొందరు అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా మిస్సింగ్ కేసులను తేలికగా తీసుకుంటున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు...

- టోలీచౌకికు చెందిన ఓ వ్యక్తి ఈ నెల 8న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే రెండు రోజుల పాటు తిప్పించుకొని కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఓ మధ్యవర్తి ద్వారా తమకు రూ. 50 వేలు ఇస్తే వెతికి పెడుతామంటూ కండీషన్ పెట్టారు. కుటుంబ సభ్యులు అంతడబ్బు ఇవ్వకపోవడంతో ఆ కేసులో పురోగతి మాత్రం 10 రోజులైనా కన్పించడం లేదు. అయితే.. ఎవరిని కూడా డబ్బులు అడగలేదంటూ స్థానిక పోలీసులు పేర్కొవడం గమనార్హం.
- కేపీహెచ్‌బీ పరిధిలో నివాసముండే ఓ వృద్ధుడు నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. మతిస్థిమితిమతం సరిగ్గా లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. చూస్తాంలే అంటూ వారిని ఇంటికి పంపించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయగా.. పోలీసులు వచ్చి అనుమానం ఉన్న ప్రాంతాల్లో గాలించారు. సీసీ కెమెరాలు పరిశీలించి లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద వృద్ధుడి ఆచూకీ గుర్తించి.. కుటుంబ సభ్యులకు అప్పగించినందుకు రూ.25వేలు డిమాండ్ చేశారు. చివరికి బేరం చేసి రూ. 10 వేలు వసూలు చేసినట్లు సమాచారం.
- గత ఏడాది డిసెంబర్‌లో చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తిని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లిదండ్రులు తమ కొడుకు శ్రవణ్ కన్పించడం లేదంటూ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వారంరోజుల తరువాత మార్చురీలో శ్రవణ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మిస్సింగ్ కేసుతోపాటు రోడ్డు ప్రమాదం విషయంలో పోలీసుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ బాధిత కుటంబ సభ్యులు స్టేషన్‌ను సైతం అప్పట్లో ముట్టడించారు.

వినాయక నవరాత్రులపై పోలీస్ ఫోకస్

ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు..

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): వినాయక నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు నగర పోలీసులు ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ, బస్తీ, కాలనీ సంఘాలతో సమావేశాలు ప్రారంభించారు. వినాయక మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు. ప్రశాంతమైన నగరంలో ఎలాంటి పుకార్లకు తావు లేకుండా అందరు కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకోవాలనే సందేశాన్ని అందరికి చేరవేస్తున్నారు. ఇప్పటికే అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాన్ని పోలీసుశాఖ నిర్వహించింది. వినాయక నవరాత్రులు, విగ్రహాల ఏర్పాటు, తదితర అంశాలకు సంబంధించిన పలు విషయాలు చర్చించారు. ఇందులో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అయితే వినాయక నవరాత్రులు, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఆర్‌నగర్ ఏసీపీపై బదిలీ వేటు

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణపై బదిలీ వేటు పడింది. డివిజన్‌లో స్నాచింగ్‌లు పెరిగిపోవడం ఒక కారణమైతే ఇటీవల ఒక ఇంట్లోకి ప్రవేశించిన పోలీసులు న్యాయవాదిపై అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన ఏసీపీ సరైన నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వలేదనే కారణాలతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా శనివారం రాత్రి ఎస్ఆర్‌నగర్ పరిధిలో స్నాచింగ్ కావడం, పక్కనే ఉన్న మధురానగర్ ఠాణా పరిధిలో సెల్‌ఫోన్ దోపిడీ ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఎస్ఆర్‌నగర్ ఏసీపీని కేంద్ర కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాదికారులు ఆదేశాలు జారీ చేశారు.

పబ్‌లో యువతికి వేధింపులు.. అడ్డుకున్న వ్యక్తిపైనా దాడి

శేరిలింగంపల్లి, ఆగస్టు 18: పబ్‌లో యువతిని వేధించి అడ్డు వచ్చిన ఆమె సంబంధీకుడిపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సన్‌సిటీలో నివాసం ఉండే ప్రశాంత్‌కుమార్ తివారీ శనివారం రాత్రి తన భార్య, మరో యువతితో కలిసి గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్ వాణిజ్యసముదాయంలోని క్రాస్‌బ్లేడ్ పబ్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి 1 గంట సమయంలో పబ్ నుంచి బయటకు వస్తుండగా తన భార్యతోపాటు యువతిని మద్యం మత్తులో ఉన్న యువకులు వేధించారు. ప్రశాంత్‌కుమార్ వారిని నిలదీయగా.. వారు అతనిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన యువతులపై సైతం దాడిచేశారు. పబ్ బయట తిరిగి ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. వెంటనే ప్రశాంత్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అర్ధరాత్రి స్నాచింగ్‌కు యత్నం.. విఫలం

ప్రతిఘటించిన బాధితుడు.. కిందపడిన చైన్

సెల్‌ఫోన్ లాక్కోని పరార్

వెంగళరావునగర్, ఆగస్టు 18 : అర్ధరాత్రి రోడ్డుపై వెళ్లున్న ఓ వ్యాపారిని గుర్తు తెలియని ఇద్దరు దొంగలు అడ్డగించి అతని మెడలోని చైన్‌ను లాక్కోవడానికి యత్నించి విఫలం చెంది.. సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం ..ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్‌నగర్‌కు చెందిన బోయ ఆంజనేయులు కొబ్బరికాయల హోల్‌సేల్ వ్యాపారి. శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో రహ్మత్ నగర్ నుంచి ఎల్లారెడ్డిగూడకు బయలుదేరాడు. యూసుఫ్‌గూడ జానకమ్మతోట వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి వ్యాపారి మెడలోని బంగారు చైన్‌ను లాక్కోవడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో జరిగిన పెనుగులాటలో చైన్ కిందపడగా.. సెల్‌ఫోన్‌ను లాక్కోని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో యువకుడి గొలుసు..

వెంగళరావునగర్, ఆగస్టు 18 : రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడి మెడలోని గెలుసును లాక్కోని పరారయ్యారు. ఈ సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం..ఏపీ, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చిల్లపల్లి గణేశ్ సీఎంఏ కోర్సు చదువుతూ ఎస్ఆర్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్నాడు. శనివారం రాత్రి చదువుకునేందుకు స్థానిక స్టడీరూంకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు అతడిని అడ్డగించి మెడలోని బంగారం గెలుసును తెంపుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీరువా మీదపడి కూలి మృతి

హయత్‌నగర్, ఆగస్టు 18: బీరువా మీదపడి ఓ కూలి మృతి చెందాడు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వివరాల ప్రకారం ...అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పసుమాముల గ్రామంలోని బీబీఆర్ కాలనీకి చెందిన దండుగుల ఎల్లస్వామి(50), కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. సాయిరెడ్డి కాలనీలో రమేశ్‌కు చెందిన ఇంట్లో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు బీరువా ఎల్లస్వామిపై పడి.. అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ప్రియురాలి మోజులోపడి.. ఆభరణాలు మాయం

- పనిచేస్తున్న సంస్థకే కన్నం వేసి జల్సాలు
- ఆడిట్‌లో బయటపడిన దొంగతనం
- నిందితుడు అరెస్టు.. 3 తులాల బంగారం ..8 తులాల డైమండ్ నెక్లెస్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నిందితుడితో పోలీసులు

హిమాయత్‌నగర్, ఆగస్టు18: ప్రియురాలి మోజులో పడి.. ఎంతో నమ్మకంగా పనిచేస్తున్న సంస్థకే కన్నంవేసి పోలీసులకు దొరికాడు. ఈ సంఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఆదివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డీఐ నాగార్జున, డీఎస్సై వెంకటేశ్‌తో కలిసి సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ వివరాలను వెల్లడించారు. చందానగర్‌లో నివాసం ఉండే మర్రిసాయి లక్ష్మణ్ గత 8 ఏండ్లుగా బషీర్‌బాగ్‌లోని శ్రీ సిద్ధి వినాయక్ జ్యువెలర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో స్టాక్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. అయితే జ్యువెలర్స్ యజమానికి సమాచారం ఇవ్వకుండా రెండు నెలలుగా విధులకు రావడం లేదు. అలాగే ఫోన్ చేసినా ఎత్తడంలేదు. ఈ క్రమంలో దుకాణంలో ఆడిట్ నిర్వహించగా అందులో 28 తులాల బంగారం మాయమైనట్టు గుర్తించి.. నిర్వాహకుడు అక్షయ్ అగర్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. 28 తులాల బంగారంతోపాటు 8 తులాల డైమండ్ నెక్లెస్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన బంగారంలోని కొన్నింటిని సికింద్రాబాద్‌లోని ఓ నగల దుకాణంలో విక్రయించగా.. అశోక్ నగర్‌లోని మన్నపురం ఫైనాన్స్‌లో డైమండ్ నెక్లెస్‌ను తాకట్టు పెట్టాడు. విక్రయించగా వచ్చిన డబ్బుతో ప్రియురాలితో కలిసి పలు ఆలయాలు సందర్శించి, విహార యాత్రలు చేయడంతో పాటు జల్సాలు చేశాడు. నిందితుడి నుంచి 3తులాల బంగారంతో పాటు మణప్పురం ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన 8 తులాల డైమండ్ నెక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం..నిర్లక్ష్యపు డ్రైవింగ్

ఢీవైడర్‌ను ఢీకొన్న కారు..

ఒకరికి తీవ్ర గాయాలు

ఖైరతాబాద్, ఆగస్టు 18 : అతివేగంతో పాటు నిర్లక్ష్యంగా కారు నడుపుతుండగా.. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని తాజ్‌కృష్ణ హోటల్ సమీపంలో జరిగింది. ఎస్సై సందీప్‌రెడ్డి వివరాల ప్రకారం ...హిమాయత్‌నగర్‌కు చెందిన జితేశ్ ఆదివారం స్నేహితులు కనిష్క, చిరాన్‌లతో కలిసి జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌కు బీఎండబ్ల్యూ కారులో బయలుదేరారు. చిరాన్ సన్ రూఫ్‌ను తెర్చుకొని బయటకు చూస్తున్నాడు. ఆ క్రమంలో వేగంగా డ్రైవింగ్ చేస్తున్న జితేశ్ సీటు బెల్టు ఊడిపోవడాన్ని గమనించి..సరిచేసుకునేందుకు తల కిందకు దించగా, కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం తునాతునకలైంది. సకాలంలో ఎయిర్ బ్యాగ్స్ తెర్చుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తితో పాటు కనిష్కకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే సన్ రూఫ్‌లో బయటకు చూస్తున్న చిరాన్‌కు మాత్రం బలమైన గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవిష్కరణలు అదుర్స్

- ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న 'ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్'
- నగర విద్యార్థుల ఆవిష్కరణలకు బహుమతులు

సంగారెడ్డి, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్- 2024లో నగరానికి చెందిన విద్యార్థులు అదుర్స్ అనిపించుకున్నారు. ఈ ఫెయిర్‌లో మొత్తం రాష్ట్రంలోని 18 పాఠశాలలకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు ప్రదర్శించగా.. ఇందులో నగరానికి చెందిన మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డిజైనింగ్ విభాగం ప్రొఫెసర్ జాన్ మాథ్యూ ఆవిష్కరణలను తిలకించారు. బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు నిహారిక, శివాంగిల ఆవిష్కరణకు మొదటి బహుమతి, రామాంతపూర్‌లోని హెచ్‌పీఎస్ స్కూల్ విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య ఆవిష్కరణకు ద్వితీయ బహుమతి, సుచిత్రలోని సెయింట్ ఆంధ్రా హైస్కూల్ విద్యార్థులు రిథిమాన్‌సింగ్, మయూర, అనన్యల ఆవిష్కరణకు తృతీయ బహుమతి లభించిం ది. మొదటి విజేతలకు రూ.20వేలు, ద్వితీయ విజేతలకు రూ.10 వేలు, తృతీయ బహుమతి విజేతలకు రూ.5 వేల చెక్కును బీఎస్ మూర్తి అందజేశారు.

యాంటీ స్లీప్ డిటెక్టర్(మొదటి బహుమతి)

బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు నిహారిక, శివాంగి నాలుగు చక్రాల వాహనాలు నడిపే డ్రైవర్ల కోసం యాంటీ స్లీప్ డిటెక్టర్ తయారు చేశారు. కార్లు,లారీలు ఇతర భారీ వాహనాలను నడిపే డ్రైవర్లు భోజనం తర్వాత, రాత్రివేళల్లో వాహనం నడుపుతూ అకస్మాత్తుగా కునుకు తీస్తుంటూరు. ఈ క్రమంలో డ్రైవర్లు నిద్రపోతే హెచ్చరించేలా విద్యార్థులు ఐ బ్లింక్ సెన్సార్ కళ్లద్దాలు, వెహికిల్ బ్రేకింగ్ సిస్టమ్ రిలే, ఫీజో బజర్ అలారమ్, ప్రోగ్రామింగ్ బోర్డుతో యాంటీ స్లీప్ డిటెక్టర్‌ను రూపొందించారు. డైవర్ ఐ బ్లింక్ సెన్సార్ అద్దాలు పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో నిద్రవస్తే వెంటనే అలారం వస్తుంది. తాము రూపొందించిన యాంటీ స్లీప్ డిటెక్టర్ అద్దాలు డ్రైవర్లకు ఎంతో ఉపయోగకరమని, తమ ఆవిష్కరణకు ఐఐటీహెచ్ మొదటి బహుమతి ఇవ్వడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్ (తృతీయ బహుమతి)

హైదరాబాద్ సుచిత్రలోని సెయింట్ ఆంధ్రా హైస్కూల్ విద్యార్థులు రిథిమాన్‌సింగ్, మయూర, అనన్య కలిసి మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్‌ను తయారు చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమ తదితర కారణాలతో గృహాల్లో అంతర్గత వాయు కాలుష్యం పెరుగుతుంది. గృహాల్లో అంతర్గత వా యు కాలుష్యం తగ్గించి గాలి శుద్ధి చేసేందుకు వీలుగా మైక్రోఆల్గే ఫర్ సస్టెయినబుల్ ఎయిర్ ప్యూరిఫికేషన్‌ను యంత్రాన్ని వీరు రూపొందించారు. రెండు ట్యాంకులుగా ఉండే ఈ యంత్రంలో ఒకరకమైన సూక్ష్మ ఆల్గే రూపొందించి స్థిరంగా గాలిని శుద్ధి చేస్తుంది. తమ ఆవిష్కరణకు తృతీయ బహుమతి రావడంపై రిథిమాన్‌సింగ్, మయూర, అనన్య హర్షం వ్యక్తం చేశారు.

డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ (ద్వితీయ బహుమతి)..

రామాంతపూర్‌లోని హెచ్‌పీఎస్ స్కూల్ విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య థియేటర్లు, దవాఖానలు, షాపింగ్ మాల్స్‌లో ఉష్ణోగ్రతల హెచ్చు,తగ్గులను నియంత్రించడం, ఎయిర్ కండీషనర్ల ద్వారా ఉత్పత్తి అయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్‌ను తగ్గించేందుకు వీలుగా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ యంత్రాన్ని రూపొందించారు. ఇవి ఉష్ణోగ్రతలను తగ్గించి చల్లటి గాలివచ్చేలా ఎయిర్ కండిషనర్లు, కూలింగ్ యూనిట్లు పనిచేసేందుకు వీలుగా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అధునాతన సెన్సర్లు బిగించారు. ఈ సెన్సర్లు పూర్తిగా ఉష్ణోగ్రతలను నియంత్రించడంతో పాటు జనానికి అవసరమైన మేర చల్లదనం వచ్చేలా డైనమిక్ టెంపరేచర్ మేనేజ్‌మెంట్ సిస్టం పని చేస్తుంది. తమ ఆవిష్కరణకు ఐఐటీహెచ్ ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్‌లో బహుమతి దక్కడంపై విద్యార్థులు స్వాతికేష్, లక్ష్య హర్షం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), 10th, Inter, B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు Ph: 8866977112, 339. NT-331669

BUSINESS OFFER

★మంచి రన్నింగ్‌లో ఉన్న Biscuits Chikki హోల్‌సేల్ బిజినెస్ చేయడానికి Investment Partner కావలెను. 8106734546. NT-331717

PACKERS & MOVERS